క్లుప్తంగా

ఈవీఎంలపై అవగాహన

ఉండ్రాజవరం: వడ్లూరు సచివాలయం వద్ద ఈవీఎంల వినియోగంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సచివాలయ కార్యదర్శి ఎస్.భూపతి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించనున్న ఈవీఎంలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమన్నారు. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యంత్రం పనిచేసే తీరు, ఓటరు ఓటు వేసే విధానంపై వీఆర్వో టి.వీరభద్రరావు, సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు, సర్పంచ్ రఘుమండ తేజశ్రీ శ్రీనివాస్, వేంద్ర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి మృతి

దేవరపల్లి: రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి ఐవీ రత్న కుమార్ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుదీర్ఘకాలం సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్‌గా పనిచేశారు. అనంతరం ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయానికి బదిలీపై వెళ్లి అక్కడ పనిచేస్తూ పదవీ విరమణ పొందారు. పలువురు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, వివిధ పార్టీల నాయకులు రత్నకుమార్ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థి తల్లిదండ్రులకు సొమ్ము అందజేస్తున్న దృశ్యం

నల్లజర్ల: దూబచర్ల జెడ్పీ హైస్కూలులో ఆరో తరగతి చదువుతున్న గంటావారిగూడెంకు చెందిన విద్యార్థి నార్శింగి ఆర్యన్ ఇటీవల అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుచున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు రూ.15వేలను ఆ విద్యార్థి తల్లిదండ్రులకు గురువారం అందజేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

చాగల్లు: మండలంలో చాగల్లు, ఊనగట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ బి.వీరభద్రరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఇద్దరి అరెస్టు

నిడదవోలు రూరల్: మండలంలోని కాటకోటేశ్వరం, కంసాలిపాలెం గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను గురువారం అరెస్టు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ తెలిపారు. కాటకోటేశ్వరం గ్రామానికి చెందిన కర్సినపు రాజుబాబు వద్ద ఆరు క్వార్టర్ మద్యం సీసాలతో పాటు రెండు ఫుల్‌బాటిల్స్, కంసాలిపాలెంలో అవిటి బుజ్జిబాబు వద్ద 21 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనపర్చుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

ఎనిమిది మందిపై కేసు

కొవ్వూరు: పట్టణంలోని కోట్లాటలో రెండు వర్గాల వారి ఫిర్యాదుల మేరకు ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. గురువారం పట్టణంలో శ్రీ రామకాలనీకి చెందిన షేక్ సజహర్ తాను మెరకవీధి మాంసం దుకాణం దగ్గర ఉన్న సమయంలో పాత గొడవల నేపథ్యంలో తనతో తగతా పడి దూర్భాషలాడి కొట్టినట్టు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ జె.శ్రీనివాసరావు తెలిపారు. సజహర్ ఫిర్యాదు మేరకు నన్నా, బషీర్, గౌస్, బాజీలపై కేసు నమోదు చేశామన్నారు. ఇదే వివాదంలో షేక్ నన్నా ఇచ్చిన మరో ఫిర్యాదు మేరకు షాజహన్, మున్నా, జాకీర్, షారూఖ్‌లపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. తనను నిందితులు నలుగురు కలిసి కొట్టినట్లు ఫిర్యాదు చేశాడన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

కొవ్వూరు: ఔరంగబాద్ సమీపంలో మసీదు వద్ద మోటారుసైకిల్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో రాజమహేంద్రవరానికి చెందిన మహిళ మంకెళ్ల శ్యామలకు తీవ్ర గాయాలయ్యాయి. వాడపల్లిలో బంధువుల ఇంటికి వెళ్లేందుకు గురువారం సాయంత్రం శ్యామల మోటారుసైకిల్ వస్తుండగా మార్గ మధ్యలో ఈ ప్రమాదానికి జరిగింది. గాయాలపాలైన ఆమె ప్రస్తుతం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

గోపాలపురంలో ఇద్దరికి...

గోపాలపురం: రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్టు పోలీసులు గురువారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురం మండలం దొండపూడి గ్రామానికి చెందిన చనిమెళ్ల చినబాబూరావు, కె.రామచంద్రరావు గోపాలపురం ఏఎంసీ కార్యాలయానికి వస్తుండగా రోడ్డు దాటుతున్న సమయంలో దేవరపల్లి నుంచి కొయ్యలగూడెం వెళుతున్న టాటా ఏసీ వాహనం బలంగా ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. వీరిని గోపాలపురం సీహెచ్‌సీకి తరలించగా ప్రాథమిక చికిత్స చేశారు. క్షతగాత్రులను గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరామర్శించి మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించాలని వైద్యులకు సూచించి రూ.5వేలు నగదును అందజేశారు.

పల్లె ఇంట.. అభివృద్ధి బాట

- రూ.6.64 కోట్లతో దేవరపల్లి అభివృద్ధి
- రోడ్లు, తాగునీటికి ప్రాధాన్యం



రూ.44 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం

దేవరపల్లి: మండల కేంద్రమైన దేవరపల్లిలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండల పరిషత్, గ్రామ పంచాయతీ, ఎంపీ ల్యాడ్స్, జిల్లా పరిషత్, గడప గడపకూ, మైనింగ్, స్థానిక శాసన సభ్యుడు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించిన నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టారు. వాటిలో దాదాపు 80 శాతం పనులు పూర్తవగా, మిగిలిన పనులు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, సామాజిక భవనాలు, వంతెనల నిర్మాణం, దళితవాడల్లోని రెండు శ్మశానవాటికల అభివృద్ధి, గ్రామ సచివాయాలు, రైతు భరోసా కేంద్ర భవనాల నిర్మాణం పూర్తి చేశారు. దేవరపల్లి పంచాయతీ పరిధిలో కొత్తగూడెం, బుచ్చియపాలెం, అచ్చియపాలెం అనే శివారు గ్రామాలు కూడా కలసి ఉన్నాయి. భవిష్యత్తులో నగర పంచాయతీ స్థాయికి చేరుకోబోతుంది. వాణిజ్య, వ్యాపార రంగాలకు దేవరపల్లి ప్రధాన కూడలి. ప్రధానంగా మూడు జాతీయ రహదారులు దేవరపల్లి మీదుగా వెళ్లడంతో అంతర్జాతీయ స్థాయిలో దేవరపల్లికి గుర్తింపు లభించింది.

ఇవీ పనులు

గత మూడున్నరేళ్లుగా 6.64 కోట్ల వ్యయంతో దేవరపల్లి పంచాయతీలో అభివృద్ధి పనులు పూర్తిచేశారు. మరో రూ. రెండు కోట్ల విలువైన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. దళితవాడల్లో రూ.90 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్లు, కమ్యూనిటీ భవనాలకు ప్రహరీల నిర్మాణం, శ్మశానవాటికల అభివృద్ధి, ప్రహరీ నిర్మాణం వంటి పనులు చేపట్టినట్టు సర్పంచ్ కడిమి వీరకుమారి తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ. 30 లక్షలు, గడపగడపకూ నిధులు రూ.60 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.20 లక్షల వ్యయంతో గ్రామంలోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయం చుట్టూ సిమెంట్ రోడ్డు, బస్టాండ్ వద్ద రూ. 25 లక్షల వ్యయంతో షాపింగ్ కాంప్లెక్స్ , చంద్రబాబు కాలనీలో రూ. 10 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు, రూ. 7 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్డు, ఇందిరమ్మకాలనీలో రూ.30 లక్షలతో సిమెంట్ రోడ్లు, రూ. 5 లక్షల వ్యయంతో గ్రావెల్ రోడ్ల నిర్మాణం చేసినట్టు ఆమె వివరించారు. రూ.45 లక్షల వ్యయంతో గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు నిర్మించినట్టు ఆమె తెలిపారు. మైనింగ్ నిధులు రూ.1.10 లక్షలతో ఇసుక వాగు అభివృద్ధి,



ఇందిరమ్మ కాలనీలో గడప గడపకూ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్లు

వాగుపై వంతెన నిర్మాణం చేపట్టినట్టు వివరించారు. వంతెన నిర్మాణం పూర్తయిందని, వాగు అభివృద్ధి పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు.రూ.1.20 కోట్లతో మూడు గ్రామ సచివాలయ భవనాలు, రూ. 60 లక్షల వ్యయంతో రైతు భరోసా కేంద్రాల భవనాలు నిర్మించినట్టు చెప్పారు. జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.68 లక్షలతో మంచినీటి పైపులైన్లు నిర్మించారు.ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.20 లక్షలతో బీసీ కమ్యూనిటీ భవనం నిర్మాణం, రూ.12 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణం చేసినట్టు చెప్పారు. 'నాడు- నేడు' పథకంలో రూ.32 లక్షలతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, రూ.50 లక్షలతో జెడ్పీ హైస్కూల్లో అదనపు తరగతుల భవన నిర్మాణం పూర్తి చేశామన్నారు.

ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా



గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎంపీపీ కేవీకే దుర్గారావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికారులు, ఎంపీటీసీ సభ్యుల తోడ్పాటుతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం. జిల్లాలోనే దేవరపల్లి పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా. పదవి చేపట్టిన రెండున్నరేళ్లలో గ్రామం అభివృద్ధికి ప్రభుత్వం రూ. 8 కోట్లు మంజూరు చేయయగా, రూ.6.64 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు పూర్తి చేశాము. రాబోవు రెండున్నర ఏళ్లలో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తా. రోడ్లు, మంచినీటి సరఫరాకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రణాళికా బద్ధంగా దళితవాడల అభివృద్ధి కృషి చేస్తున్నాను.

– కడిమి వీరకుమారి, సర్పంచ్, దేవరపల్లి

వేంకటేశ్వరుని ఆభరణాల లెక్కల్లో తేడా



స్వామివారి ఆభరణాలను లెక్కిస్తున్న దేవదాయ శాఖాధికారులు

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆభరణాలను లెక్కింపు విషయంలో వెండి, బంగారం వస్తువుల లెక్కల్లో తేడా ఉందని దేవదాయ ధర్మదాయ శాఖ జూవెలరీ వెరిఫికేషన్ అధికారి అల్లు భవాని తెలిపారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారి ఆభరణాల లెక్కకట్టగా వాటిలో వెండి, బంగారు ఆభరణాలు విషయంలో కొద్ది తేడా వచ్చిందని ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. స్వామి అమ్మవార్ల ఆభరణాలు తేడాపై వివరణ కోరగా గత ఈఓ జి.వి.శ్రీనివాస్ ఆలయ అర్చకులకు ఇచ్చానని తెలిపారని వారు మాకు ఇవ్వలేదని సమాధానం చెప్పారని, దీనిపై ఎటువంటి ఆధారాలు లేవని అందుకు ఈఓదే బాధ్యత అని వివరించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని, వారి ఆదేశాలను పాటిస్తామ న్నారు. స్వామి, అమ్మవార్ల ప్రధాన ఆభరణాలు లెక్కకు సరిపోయాయని తెలపగా, అసలు వెండి ఎన్ని గ్రాములు, బంగారం ఎంత అని ప్రశ్నించగా ఆ వివరాలు చెప్పకూడదని ఉన్నతాధికారులకే చెబుతామని తెలిపారు. ఈఓ మీసాల రాధాకృష్ణ, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందాలపై ప్రత్యేక నిఘా

- సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ
- డివిజన్‌లో పోలీసు, రెవెన్యూ అధికారులతో సమీక్ష
- పర్యవేక్షణకు గ్రామ, మండల స్థాయి కమిటీల ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు: సంక్రాంతిని పురస్కరించుకొని డివిజన్‌లో జూద క్రీడలు, కోడి పందాలపై నిషేధం అమలులో ఉందని, ఎక్కడైనా ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో కోడిపందాల నిషేధంపై పోలీసు, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్‌లో కోడి పందేలు నిర్వహించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కోడి పందాలు, జూద క్రీడలపై కోర్టు స్పష్టమైన ఆదేశం ఇచ్చిందని, ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలని సూచించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని కోడి పందాల నిర్వాహకులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. బరుల నిర్వహణకు అనుమతిచ్చే భూమి యాజమానులపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల్లో జూద క్రీడలు, కోడి పందేల నియంత్రణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యక్రమాల నియంత్రణకు మండల స్థాయిలో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి విస్తృత తనిఖీ నిర్వహించాలని సూచించారు. ఇటువంటి ఘటనలపై 144 సెక్షన్, తదితర అనుబంధ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్య దర్శులు, వీఆర్వోల సమన్వయంతో పని చేయాలని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సూచించారు. డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ పేకాట, కోడి పందాలు నిర్వహణకు సంబంధించి గడచిన మూడేళ్ల నుంచి ఉన్న కేసులను పరిగణనలోకి తీసుకుని బైడోవర్ నమోదు చేస్తున్నామన్నారు. ముందుస్తుగా గ్రామాల్లో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు డివిజన్ వ్యాప్తంగా సదస్సులు నిర్వహించనున్నట్లు డీఎస్పీ ప్రకటించారు. ఈ సమావేశంలో ఆర్డీవో కార్యాలయం ఏవో జవహర్ బాజీ, డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందాలపై నిషేధాజ్ఞలు

నల్లజర్ల: సంక్రాంతి సందర్భంగా నిర్వహించే కోడి పందాలపై ఉన్నతాధికారులు నిషేధాజ్ఞలు విధించినట్టు తహసీల్దారు కిశోర్‌కుమార్ చెప్పారు. స్థానిక పరిషత్ కార్యాలయంలో వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో గురువారం సాయంత్రం ఆయన సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. సంక్రాంతి ముసుగులో ఎవరూ కోడి పందాలు, జూదాలకు పాల్పడినా చట్ట రీత్య చర్యలు తీసుకుంటామన్నారు.రెవెన్యూ, పోలీస్, సచివాలయ సిబ్బంది సమావేశాలు నిర్వహించి పేకాట, గుండాట, కోడిపందాలు నిర్వహణ, అసాంఘిక కార్యక్రమాలపై ఉన్న నిషేధంపై ప్రజలకు అవగాహన కలించాలన్నారు. ప్రతి గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని వీఆర్వోలకు సూచించారు.

తాళ్లపూడి: సంక్రాంతి సందర్భంగా ప్రజలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని జూదాలు, కోడిపందాలు వంటి వాటి జోలికి వెళ్లవద్దని తహసీల్దార్ టి.రాధిక కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సంఘ వ్యతిరేక కార్యకాలాపాలు చేపట్టే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అమలు చేయాల్సిన కార్యక్రమాలు, చట్ట పరమైన చర్యలు వంటి అంశాల పై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఎంపీడీవో టి.బి.వెంకట రమణ, ఏఎస్సై ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దర్శకుడు వీవీ వినాయక్‌ను కలిసిన నాయకులు



దొమ్మేరులో వీవీ వినాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లపూడి: స్థానికంగా జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి వచ్చిన ప్రముఖ సినీ దర్శకుడు వీవీ వినాయక్‌ను గురువారం మండలానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. జెడ్పీ వైస్ ఛైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ, తాడిపూడి సర్పంచ్ నామా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు పోశిన శ్రీకృష్ణదేవరాయులు, వంబోలు పోశిబాబు, వనిమిరెడ్డి శ్రీనివాస్, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, సిద్ధంశెట్టి కృష్ణ, నూతంగి సురేష్, ఎలిపే రాజు, కె.శివ వినాయక్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

చాగల్లు: చాగల్లులో జిల్లా యువజన విభాగం అధ్యక్షులు చౌటుపల్లి వీరన్న, కొవ్వూరు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, తోట రామకృష్ణ, తిగిరిపల్లి వెంకట్రావు, చింతా వెంకటస్వామి, ఎన్.ప్రకాశం, జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, చాగల్లు మండల పార్టీ గౌరవాధ్యక్షులు జుట్గా కొండలరావు, పలువురు కాపు నేతలు కలుసుకున్నారు.

కొవ్వూరు: ప్రముఖ సినీ దర్శకుడు వీవీ వినాయక్‌ను వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం దొమ్మేరులో మర్యాద పూర్వకంగా కలిశారు. ఐ.పంగిడి సర్పంచ్ గోశాల నాగర్జున, కాపవరం మాజీ సొసైటీ అధ్యక్షుడు కామన రత్నాజీ, ఇంటి వీర్రాజు, అంతకు ముందు చాగల్లులోని ఆయన స్వగృహంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, తాళ్లపూడి మండల కాపు సంఘం అధ్యక్షుడు నామా ప్రకాశం, రాష్ట్ర కాపు సంఘం జేఏసీ నాయకులు తోట రామకృష్ణ,పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు,చాగల్లు మండల వైఎస్సార్ సీపీ గౌరవ అధ్యక్షుడు జుట్గా ఏడుకొండలుతోపాటు పలువురు స్నేహితులు, బంధువులు అధిక సంఖ్యలో ఆయన్ని మర్యాద పూర్వకంగా కలిశారు.

పారిశుధ్య పనులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

కొవ్వూరు: మున్సిపాలిటీ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సమ్మెలో కొనసాగుతున్న నేపథ్యంలో పట్టణం, నగర వాసులకు ఏ విధమైన ఇబ్బందుల్లేకుండా పారిశుధ్యం మెరుగుకి చర్యలు తీసుకుంటున్నామని రీజనల్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఎస్‌వీవీ సత్యనారాయణ ప్రకటించారు. సమ్మె ప్రభావంలో క్షేత్ర స్థాయిలో పరిస్థితులు పరిశీలనలో భాగంగా గురువారం సాయంత్రం కొవ్వూరు పురపాలక సంఘానికి ఆయన విచ్చేశారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ మేరకు ఆయన సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు వినతిపత్రం అందజేశారు. అనంతరం సత్యనారాయణ విలేకర్లతో మాట్లాడారు. పట్టణంలో తాగునీటి, పారిశుధ్యం, వీధిలైట్లు నిర్వహణ వంటి పనులు గురించి కమిషనర్ బి.శ్రీకాంత్‌ను ఆరా తీశారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా ముందస్తు కార్యచరణ ప్రణాళికతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. కొవ్వూరులో 37 మంది, నిడదవోలులో 29 మంది, రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో 330 మంది రెగ్యులర్ పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారన్నారు. సమ్మె నేపథ్యంలో అదనపు సిబ్బందిని నియమించుకుని ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటాన్నామన్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగన్



గోపాలపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, శ్రీనివాసనాయుడు

గోపాలపురం: ఇచ్చిన మాట నిలబెట్టుకొనే వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక ఏఎంసీ ఆవరణలో ప్రభుత్వం పెంచిన పింఛన్లను గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ప్రతి క్షణం పరి తపించే వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గోపాలపురం నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి మేలు జరిగితేనే నాకు ఓటు వేయండి అని ప్రజల సమక్షంలో బహిరంగంగా ప్రకటించిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ తోట నాగేశ్వరరావు, సర్పంచులు పఠాన్ అన్సర్‌భాషా, పైడి శిరీష, నాయకులు ముల్లంగి శ్యామ్ సుందర్ రెడ్డి, దుగ్గిరాల రమేష్‌బాబు, ఎం.శ్రీనివాసరెడ్డి, మండలంలోని వైఎస్సార్ సీపీ సర్పంచ్, ఎంపీటీసీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పెరవలి: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో రూ.3 వేలుకు సామాజిక పింఛన్లను పెంచి ఎన్నికల్లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుకను గురువారం పండగ వాతావరణంలో 166 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం జగన్ విడతల వారీగా పింఛను పెంచారని తెలిపారు. ఈ క్రమంలో అన్నవరప్పాడు గ్రామానికి చెందిన మాగంటి విష్ణుప్రియ 25 ఏళ్ల క్రితం తన భర్త మృతి చెందాడని గత టీడీపీలో పింఛను మంజూరైందని, రెండు నెలలు ఇచ్చి తనకు ఇల్లు ఉందని పింఛను తీసివేశారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కొత్తగా పింఛన్ మంజూరైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజనీ, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు వి.సత్యనారాయణ, వైస్ ఎంపీపీ శ్రీనువాస్ ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు

- మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ బంక జయలక్ష్మి
- నల్లజర్ల మండల పరిషత్ సమావేశం



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బంక జయలక్ష్మి

నల్లజర్ల: రానున్న 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి సభ్యులు ప్రతిపాదనలు అందించాలని ఎంపీపీ బంక జయలక్ష్మి కోరారు. నల్లజర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం సాయంత్రం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ఫండ్‌తో గ్రామాల్లో తాగునీరు, డ్రైన్లు, మహిళా, శిశు అభివృద్ధి సంబంధిత పనులు మొత్తం 7 అంశాలకు ప్రాధాన్యముంటుందన్నారు. అన్ని గ్రామాల్లో సభలు నిర్వహించి పనులు గుర్తించాలని సూచించారు. ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడతామన్నారు. ఎంపీడీఓ రాజశేఖర్ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మె కారణంగా కేంద్రాల నిర్వహణ సచివాలయ, వలంటీర్లు నిర్వహిస్తున్నారని ప్రజా ప్రతినిధులంతా సిబ్బంది సమ్మె పూర్తయ్యే వరకూ కేంద్రాలు సక్రమ నిర్వహణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దారు కిశోర్‌కుమార్ మాట్లాడుతూ రేషన్ పంపిణీలో ఎక్కడైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ అజయ్ బాబు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ రెండో దశ పనులకు రూ.12కోట్లతో పనులు ప్రారంభించనున్నట్టు సభ్యులకు వివరించారు. గడప గడపకూ కార్యక్రమంలో పనులు పూర్తి చేసిన గ్రామాలకు మరో రూ.20లక్షలతో పనులు చేపట్టే అవకాశం ఉందన్నారు. వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను సభకు సమర్పించారు.

సభలో మాట్లాడే అవకాశం ఇవ్వండి

సమావేశంలో సర్పంచులకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని తెలికిచెర్ల, మార్లెమూడి సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. శింగరాజు పాలెంలో గడప గడపకూ పనులు ప్రారంభం కాలేదని ఎంపీటీసీ సభ్యురాలు వామిశెట్టి పావనీకుమారి సమావేశం దృష్టికి తీసుకురాగ అదే గ్రామానికి చెందిన సర్పంచ్ గద్దే బాలగంగాధర తిలక్ వ్యంగ్యంగా మాట్లాడటంతో ఇద్దరి మధ్య కొద్దిసేపు పరస్పర ఆరోపణల పర్వం జరిగింది. సమావేశంలో సొసైటీ చైర్మన్ కారుమంచి రమేష్, వైస్ ఎంపీపీలు అచ్యుత శివాజీ, ఆరుగొల్లు మణి, ఈఓపీఆర్డీ సింహాద్రి, విద్యుత్ శాఖ ఏడీ రాజబాబు, ఏఓ కమల్‌రాజ్, ఎంఈఓలు సత్యనారాయణ, భగవతి తదితరులు పాల్గొన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరావు మృతికి సమావేశం సంతాపం తెలియజేసింది.

జై భారత్ నేషనల్ పార్టీ జిల్లా సమన్వయకర్తగా వరప్రసాద్

కొవ్వూరు: జేడీ లక్ష్మీనారాయణ నూతనంగా స్థాపించిన జై భారత్ నేషనల్ పార్టీకి జిల్లా సమన్వయకర్తగా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామానికి చెందిన జువ్విరెడ్డి హనుమంత వరప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధినేత వీవీ లక్ష్మీనారాయణ నుంచి గురువారం నియామక ఉత్తర్వులు అందాయని ఆయన తెలిపారు.

నేడు జిల్లాస్థాయి నృత్య పోటీలు

నిడదవోలు: శ్రీ చైతన్య కళాసమితి ఆధ్వర్యంలో పట్టణంలోని ఏబీఎస్ టౌన్ హాలులో గురువారం ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్టు సంఘ అధ్యక్షుడు గోనమోయిన శ్రీరామకృష్ణ పరమహంస తెలిపారు. వృద్ధ కళాకారులకు సత్కారం, గౌరవ పురస్కార సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు హాజరవుతారన్నారు.

బాలోత్సవాల కమిటీ పరిశీలన

దేవరపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే బాలోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆ కమిటీ సభ్యులు ఉండవల్లి కృష్ణారావు గురువారం విలేకరులకు తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 36 అడమిక్, నాన్ అకడమిక్ అంశాలతో బాలోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వెంకట్రావు హాజరవుతారన్నారు.

రోగులకు భోజనం ఏర్పాటు

కొవ్వూరు: లయన్స్‌క్లబ్ సభ్యుడు గూడపాటి వెంకట సత్య శివప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ఉచిత భోజన పథకంలో రోగులు, వారి సహాయకులకు గురువారం భోజన వసతి కల్పించారు. శ్రీ సత్యసాయి అన్నపూర్ణ పథకం ద్వారా నారాయణ సేవతో ఈ ఉచిత భోజన పథకం నడుపుతున్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కలగర వెంకట్రావు, కార్యదర్శి పెనుమాక జయరాజు, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, మన్యం బుల్లి బాబు, ఎండీ హుస్సేన్, క్లబ్ కోశాధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ డే

చాగల్లు: స్థానిక భవితా కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ డే ను గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖాధికారి వి.ఖాదర్‌బాబు మాట్లాడుతూ బ్రెయిలీ అంధుల పాలిట ఆశాజ్యోతి అని అన్నారు. బ్రెయిలీని ఆవిష్కరించి అంధులకు విద్యప్రదాత అయ్యారని అన్నారు.